తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యాపేట
యాద్రాద్రి భువనగిరి
బుధవారం
08 అక్టోబర్ 2025
పేజీలు : 8
Follow :

# భారీగా గంజాయి పట్టివేత

•60 లక్షల విలువైన 1.20 క్వింటాళ్ల గంజాయిని సీజ్ చేసిన పోలీసులు •ముగ్గురు అంతరాష్ట్ర నిందితుల అరెస్టు •గంజాయి రవాణా,సరఫరా, అమ్మకం,వినియోగం నేరం •ఎన్డీపీఎస్ చట్టాల ప్రకారం షాపుల కఠిన చర్యలు తప్పవు •సూర్యాపేట జిల్లా ఎస్పీ కె.నరసింహ



**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):** గంజాయి రవాణా,సరఫరా, అమ్మకం, వినియోగం నేరమని,ఎన్డీపీఎస్ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తప్పవని సూర్యాపేట జిల్లా ఎస్పీ కె.నరసింహ అన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో గంజాయి పట్టివేత కేసు వివరాలు, అరెస్ట్ వివరాలను వెల్లడించారు.జిల్లాలో గంజాయి రవాణా, సరఫరా, వినియోగం,అమ్మకాలపై జిల్లా పోలీస్ శాఖ పటిష్టమైన నిఘా ఉంచి, దీని నిర్మూలన కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు.జిల్లాలో విస్తృతమైన పోలీసు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.గత నెల 23న కోదాడ పట్టణ పరిధి జాతీయ రహదారి వెంబడి సుమారు 110 కేజీల గంజాయిని గుర్తు తెలియని వ్యక్తులు వదిలేసి వెళ్లారని,దీనిని గుర్తించిన కోదాడ పట్టణ పోలీసులు స్వాధీన పరుచుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.ఈ దర్యాప్తులో భాగంగా నిందితులను గుర్తించడం కోసం 3 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సాంకేతిక ఆధారాలు, సీసీ పుటేజి, నమ్మదగిన సమాచారం మేరకు సోమవారం కోదాడ పట్టణ పోలీసులు పట్టణ పరిధి జాతీయ రహదారిపై కట్టకొమ్ముగూడెం ఎక్స్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పోలీసును గమనించి అనుమానాస్పదంగా పారిపోతున్న కారును వెంబడించి పట్టుబడి చేసినట్లు చెప్పారు.

మిగతా 2లో

# ఏకగ్రీవం చేస్తే.. రూ.30 లక్షలిస్తా..!

## మధిర మండలంలోని రాయపట్నం గ్రామ సర్పంచ్ ఆశావహుడి ఆఫర్




**మధిర, అక్టోబర్ 7 (జనంసాక్షి):** తనను సర్పంచ్గా ఏకగ్రీవంగా ఎన్నుకుంటే గ్రామ అభివృద్ధికి రూ. 30 లక్షలు విరాళం ఇస్తానంటూ మధిర మండల పరిధిలోని రాయపట్నం గ్రామానికి చెందిన సర్పంచిగా పోటీ చేయాలనుకున్న వ్యక్తి ఆఫర్ ప్రకటించాడు. రాయపట్నం గ్రామ పంచాయతీలో సుమారుగా 1800 మంది ఓటర్లు ఉండగా బీసీ జనరల్ గా రిజర్వేషన్ ఖరారైంది.. సర్పంచ్ గా ఎన్నుకుంటే గ్రామ అభివృద్ధికి రూ. 30 లక్షలు విరాళంగా ఇస్తానని గ్రామ అభివృద్ధిని అభివృద్ధి చేసి చూపిస్తానని రాయపట్నం గ్రామానికి చెందినయువ నాయకుడు తెలిపారు. మీడియా వేదికగా తెలియజేశాడు. అయితే గ్రామ ప్రజలు అందరూ కలిసి దీనిపై గ్రామస్తులు ఎలా స్పందిస్తారనేది వేచి చూడాలి..

# చాచా నెహ్రూ విగ్రహం ఎక్కడ ?



నెహ్రూ గంజ్ దేవరకొండ పట్టణంలో ఒకప్పుడు కీలక ప్రాంతం. ఈ ప్రాంతంలో దివంగత ప్రధాని పండిత జవహర్లాల్ నెహ్రూ విగ్రహం, విగ్రహం చుట్టూ పచ్చని చెట్లు,పూలతో, ప్రశాంతమైన వాతావరణం ఎంతో ఆకర్షణీయంగా ఉండేది. ఆ ప్రాంతం గుండా వెళ్లేవారు ఆకర్షణంగా తిలకించేవారు. రోడ్డు విస్తరణలో భాగంగా నెహ్రూ విగ్రహం ఉన్నట్టుండి మాయమయ్యింది. పట్టణంలో చాచా నెహ్రూ విగ్రహం లేకపోవడం పట్టణ ప్రజల గుండెల్లో అలజడి రేపుతుంది. సంబంధిత శాఖల వారు వెంటనే చాచా నెహ్రూ విగ్రహాన్ని పున నిర్మించడానికి చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

**జనంసాక్షి , దేవరకొండ**




# సిజెఐ పై దాడి చేయడం రాజ్యాంగంపై దాడి చేయడమే

## విధులు బహిష్కరించి నిరసన వ్యక్తంచేసిన న్యాయవాదులు

**తుంగతుర్తి అక్టోబర్ 7 (జనంసాక్షి)**

సనాతన ధర్మం కాలం చెల్లిందని అభిప్రాయం చెప్పిన భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పై దాడి చేయడం రాజ్యాంగం పైన దాడి చేయడమేనని తుంగతుర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షులు అన్నపర్తి జ్ఞాన సుందర్ అన్నారు.సుప్రీంకోర్టు భారత ప్రధాన న్యాయమూర్తి పై బూటు విసిరిన చర్య ను తీవ్రంగా ఖండిస్తూ మంగళవారం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఎదుట బార్ అసోసియేషన్ సభ్యులు విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జ్ఞాన సుందర్ మాట్లాడుతూ

మిగతా 3లో

# ఎన్నికల విధుల్లో ఎటువంటి పొరపాట్లకు తావివ్వొద్దు

## కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):** గ్రామపంచాయతీ,జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు.గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై మంగళవారం కలెక్టరేట్ లో నోడల్ అధికారులు,రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ నామినేషన్లు మొదలుకొని ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంత వరకు ఎలాంటి తప్పు జరగకుండా చూసుకోవాలని అన్నారు. ముఖ్యంగా నామినేషన్ల సందర్భంగా పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రత్యేకించి రాజ్యాంగపరమైన అంశాల పట్ల పొరపాట్లకు తావివ్వద్దన్నారు.ఎన్నికలకు సంబంధించి అన్ని అంశాల పట్ల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని చెప్పారు.సూర్యాపేట జిల్లాలో రెండు విడతల్లో ఎన్నికలు జరగనుండగా, మొదటి విడతలో సూర్యాపేట డివిజన్ ,అనంతరం హుజూర్ నగర్, కోదాడ డివిజన్లలో ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు.మొదటి విడతన సూర్యాపేట డివిజన్ లోని 11 మండలాలలో 112 ఎంపీటీసీ స్థానాలు, తదుపరి విడతన కోదాడ, హుజూర్ నగర్ లోని 12 మండలాలలో 123 ఎంపిటిసి స్థానాలకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందన్నారు.రాష్ట్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం మొదటి విడతన అక్టోబర్ 9న, రెండవ విడత ఎన్నికలకు అక్టోబర్ 13న నోటిఫికేషన్ విడుదల చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు.ఎన్నికలను సక్రమంగా నిర్వహించేందుకు రిటర్నింగ్ అధికారులకు, పిఓ లకు, నోడల్ అధికారులకు ఎన్నికల సంఘం ద్వారా హ్యాండ్ బుక్స్ ఇవ్వడం జరిగిందని ,అంతేకాక ఎప్పటికప్పుడు సర్క్యూలర్లు జారీ చేయడం జరుగుతుందన్నారు. వీటన్నిటిని ప్రతి ఒక్కరు చదవాలని కోరారు.మాస్టర్ ట్రైనర్ రమేష్ జడ్పిటిసి ,ఎంపిటిసి నామినేషన్ల ప్రక్రియపై పూర్తిస్థాయిలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.నోటీసు జారీ చేయటం మొదలుకొని నామినేషన్ల స్వీకరణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ, బరిలో ఉన్న అభ్యర్థుల ప్రకటన తదితర అన్ని అంశాలను వివరించారు.నామినేషన్ల స్వీకరణ సందర్భంగా, నోటిఫికేషన్ జారీలో ఎలాంటి తప్పులు ఎలాంటి కొట్టివేతలు, దిద్దివేతలు ఉండరాదని తెలిపారు.ప్రస్తుతం ఉన్న ఆదేశాల ప్రకారం 9వ తేదీ ఎంపిటిసి, జడ్పిటిసి మొదటి విడత ఎన్నికల నోటిఫికేషన్ జారీతో పాటు, ఓటరు జాబితాను సైతం ప్రచురించాల్సి ఉంటుందన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అన్ని మండలాల ఆర్వోలు,సహాయ రిటర్నింగ్ అధికారులను బృందాలుగా ఏర్పాటు చేసి నోటిఫికేషన్ జారీ, నామినేషన్ల స్వీకరణ, పరిశీలన ,ఉపసంహరణ, స్వీకరించాల్సిన ధృవపత్రాలు ఇతర అన్ని అంశాలపై మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె.సీతారామారావు , జడ్పి సీఈఓ, ఇన్చార్జి డిఆర్డిఓ పిడి అప్పారావు, డిపిఓ యాదగిరి, డిఎఫ్ఓ సతీష్, నోడల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు .

# భారీగా గంజాయి పట్టివేత



ఇందులో ఏ1 కణం రమేష్ ఉండగా అతని వద్ద 10 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.ఇతని ఒప్పుకోలు ప్రకారం ఏ2 నిందితులు చాపల అశోక్, ఏ3 చాపల ఎరకమ్మలను అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేయగా గత నెలలో కోదాడ పట్టణ పరిధిలో 110కేజీల గంజాయిని వదిలేసి వెళ్లినట్లు ఒప్పుకున్నారని, జిల్లా పోలీసులు విస్తృత తనిఖీలు చేస్తున్నందున దొరుకుతామనే భయంతో పారేసి పారిపోయినట్లు ఒప్పుకున్నట్లు చెప్పారు. రెండు కేసులలో కలిపి రూ.60 లక్షల విలువైన 120 కేజీల గంజాయి,కారు,8 సెల్ ఫోన్ లను స్వాధీనం చేస్తున్నట్లు తెలిపారు.హైద్రాబాద్ కు చెందిన నేరస్తుడు ఏ1 కణం రమేష్ నిత్యాన్నదానములు కలిగిన ఆశ్రమాలకు బియ్యం సప్లై చేసుకుంటూ వ్యాపారం చేసేవాడని, సరైన ఆదాయం పొందలేక మిల్లర్లకు డబ్బు చెల్లించలేదని, వ్యాపారం బాగాలేదని, మానసిక ప్రశాంతత కొరకు కుటుంబం నుండి దూరంగా ఉండి ఆశ్రమంలో తిరుగుతుండగా తనకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయనగరం జిల్లాకు చెందిన ఏ3 ఎరకమ్మ పరిచయమైనట్లు తెలిపారు.ఇద్దరు కలిసి గత రెండేళ్ల నుండి కలిసి విజయవాడలో ఉంటూ మరలా బియ్యం వ్యాపారం చేయగా వ్యాపారంలో మళ్ళీ నష్టం వచ్చిందన్నారు. ఎలాగైనా అధిక డబ్బులు సంపాదించాలంటే గంజాయి వ్యాపారం చేస్తే తన అప్పులు తీరుతాయని ఏ3 ఎరకమ్మతో కలిసి అధిక డబ్బులు సంపాదించవచ్చని పథకం వేశారన్నారు.ఏ 2 అశోక్ ను విజయవాడ కు పిలిపించి గంజాయిని ఒడిశా నుండి విజయవాడకు తెప్పించి హైదరాబాద్ లో కావాల్సిన వారికి అమ్మాలనే ఉద్దేశ్యంతో అశోక్ కి డబ్బులు ఇవ్వగా ఒడిశాకు వెళ్ళి కేజీ 5 వేల చొప్పున 110 %ఖ+% ల గంజాయిని కొనుగోలు చేసి బస్తాలలో ప్యాక్ చేసుకొని సెప్టెంబర్ 22 రాత్రి విజయవాడలోని ఎరకమ్మ రూముకు తీసుకొని రాగా రమేష్ అట్టి గంజాయిని విజయవాడలో తన యొక్క కారులో లోడ్ చేసుకొని సెప్టెంబర్ 23 తెల్లవారుజామున విజయవాడ నుండి హైదారాబాద్ కు వెళుతుండగా మార్గమధ్యలో కోదాడ పట్టణ శివారులో రోడ్డుపై పోలీస్ వారు వాహనాలు తనిఖీలు చేస్తుండగా మరలా విజయవాడ వైపుకు కొద్ది దూరం వచ్చి అక్కడ ఒక స్థలం చూసుకొని హైదరాబాద్ వైపు కు సర్విస్ రోడ్ ప్రక్కనే భారత్ పెట్రోల్ బంక్ ప్రక్కనే ఉన్న ఒక షెడ్ లోపలికి వెళ్ళి వారి వద్ద ఉన్న 110 కేజీల గంజాయిని పడవేసి ఎరకమ్మకు ఫోన్ ద్వారా చెప్పగా అక్కడ నుండి పారిపోయి రమ్మనగా విజయవాడకు వచ్చాడన్నారు.వారి పథకం విఫలం కావటంతో కొన్ని రోజులు వేచి చూసి ఈనెల 5న రాత్రి అశోక్ మరలా 10కేజీల గంజాయి ఒడిశా నుండి తీసుకురాగా రమేష్ ఈనెల 6న ఉదయం 10 గంటలకు అట్టి గంజాయిని తన కారులో వేసుకొని అమ్ముటకు విజయవాడ నుండి హైదరాబాద్ కు వెళుతుండగా మార్గ మధ్యలో కోదాడ పట్టణ శివారులోని కట్టకొమ్ముగూడెం క్రాస్ రోడ్ దగ్గర పోలీస్ వారు వాహనాలు తనిఖీలు చేస్తుండగా, పోలీసు వారిని చూసి కారును వేగంగా నడపగా పోలీసు వారు వెంబడించి పట్టుబడి చేసినట్లు తెలిపారు. అతని వద్ద ఉన్న 10 కేజీలు గంజాయిని, 6 సెల్ ఫోన్లు, ఒక కారు,స్వాదీనపరుచుకొని, ఒప్పుకోలు తర్వాత విజయవాడలో మిగిలిన ఇద్దరిని పట్టుబడి చేసి వారి వద్ద రెండు ఫోన్లు స్వాదీనం చేసుకున్నట్లు తెలిపారు.ఈ కేసును త్వరితగతంగా ఛేదించడంలో ప్రతిభ కనపరిచిన కోదాడ టౌన్ సీఐ శివ శంకర్, సీసీఎస్ ఎస్ఐ హరికృష్ణ, కోదాడ పట్టణ ఎస్ఐ హనుమనాయక్, హెడ్ కానిస్టేబుల్ బాల్తు శ్రీనివాస్, కానిస్టేబుల్ యల్లారెడ్డి, జి.సతీష్, ఎం.వెంకటేశ్వరులు, కె.రాం బాబు, ఎస్కే.ఫరీద్ సిబ్బంది, ఐటీ కోర్ స్టాఫ్ ను రివార్డ్ తో అభినందించారు.



# అవంతిపురం కేజీబీవీని ఆకస్మిక తనిఖీ

○ పది విద్యార్థుల పట్ల ప్రత్యేక చొరవ తీసుకోవాలి

○ జిల్లా విద్యాధికారి బొల్లారం బిక్షపతి



**మిర్యాలగూడ, అక్టోబర్ 07, ( జనం సాక్షి)** పదవ తరగతి విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపి, ర్యాంకుల సాధనకు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి బొల్లారం బిక్షపతి కోరారు. మంగళవారం మిర్యాలగూడ మండలంలోని అవంతిపురం కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. విద్యార్థులకు అందించాల్సిన ఆహార పదార్థాల, కూరగాయల నాణ్యతను పరిశీలించారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందజేయాలని పాఠశాల సిబ్బందిని ఆదేశించారు. భోజనం నాణ్యత విషయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా పర్యవేక్షణ చేయాలని అన్నారు. పదవ తరగతి విద్యార్థులకు ప్రతిరోజు ఉదయం సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించి ఈ సంవత్సరం మంచి ఫలితాలు సాధించేటట్లు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి, నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి లావూరి బాలు నాయక్, కేజీబీవీ ప్రత్యేక అధికారిణి పార్వతి, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్లపై వేసిన పిటీషన్‌ను ఉపసంహరించుకోవాలి



**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై హైకోర్టులో వేసిన పిటిషన్ ను ఉపసంహరించుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు చలమల్ల నరసింహా డిమాండ్ చేశారు.బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపు మేరకుమంగళవారం జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద ఆ సంఘం జిల్లా అధ్యక్షులు చలమల్ల నరసింహ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభాలో 60 శాతం ఉన్న బీసీలు మేమెంతో మాకంత అనే నినాదంతో దామాషా పద్ధతి ప్రకారం చట్టసభల్లో, విద్యా, ఉద్యోగాల్లో, రాజకీయ రిజర్వేషన్లు 50 శాతం ఇవ్వాలని అన్నారు.బీసీలకు రాజ్యాధికారం కావాలని గత 30 సంవత్సరాల నుంచి బీసీ సంఘం తరుపున అనేక పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు.తొమ్మిది శాతం ఉన్న అగ్రకులస్తులు రాజ్యాధికారం చేస్తూ బీసీల సంక్షేమాన్ని మరిచారని అన్నారు.బీసీలు అన్ని రంగాలలో వెనుకబడి పోతున్నారని రాజ్యాధికారం వస్తే తప్ప అభివృద్ధి చెందమనే ఉద్దేశంతో తమకు దక్కవలసిన రిజర్వేషన్లను డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. బీసీల మీద అన్ని రాజకీయ పార్టీల రెడ్డి కులస్తులకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే హైకోర్టులో వేసిన పిటీషన్ ను ఉపసంహరింపజేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అప్పం శ్రీనివాసరావు, బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శులు భూపతి నారాయణ గౌడ్, దాసరి వెంకన్న యాదవ్, జిల్లా కార్యదర్శి గొట్టిపర్తి శ్రీకాంత్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు నిద్ర సంపత్ నాయుడు,యలగందుల సుదర్శన్, బండపల్లి శ్రీనివాస్ ,బైరు విజయ్ కృష్ణ, బత్తుల దశరథ, మట్ట రమేష్, తన్నీరు వాసుదేవ్, బంటు నాగేందర్, జక్కుల రామచందర్ యాదవ్, దోరేపల్లి రవి, శీలం శ్రీనివాస్, యలగందుల వెంకటేశ్వర్లు, జమలాపూరీ నరేష్, గంగాధర జానకిరాములు, బడుగు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ సదస్సుకు గోవిందు కిరణ్ కి ఆహ్వానం




**దేవరకొండ, అక్టోబర్ 07(జనంసాక్షి)** స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో ఈ నెల 8న దుబాయిలో జరగనున్న అంతర్జాతీయ సదస్సుకు హాజరు కావాలని హైదరాబాద్ బ్రాంచ్ కి చెందిన గోవిందు కిరణ్ కి ఆహ్వానం అందింది. స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ లో అత్యుత్తమ బిజినెస్, కస్టమర్స్ కు ఉత్తమ సేవలు అందించినందుకు గాను గోవిందు కిరణ్ కి ఈ అవకాశం లభించినట్లు సీనియర్ సేల్స్ మేనేజర్ వెంకట్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన్ను బ్రాంచ్ మేనేజర్ ఆదిల్, రీజినల్ మేనేజర్ యుగంధర్ మరియు బ్రాంచ్ అధికారులు, సిబ్బంది అభినందించారు.



# బాలల చట్టాలపై అవగాహన కార్యక్రమం

వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న డిసిపియు యూనిట్ ఎయిడ్ ఎన్జీవో సంస్థ ప్రతినిధులు

**పెన్ పహాడ్, అక్టోబర్ 07 (జనంసాక్షి) :** మండల కేంద్రంలోని. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంలకు ఆశా కార్యకర్తలకు వైద్య సిబ్బందికి డీసీపీ యూనిట్ అధికారి మీరా సాబ్ సోషల్ వర్కర్ శ్రీలక్ష్మి ఎయిడ్ సంస్థ మండల కమ్యూనిటీ మొబిలైజర్ వి సోమన్న బాలల చట్టాలపై అవగాహన కల్పించారు అనంతరం బాల్యవివాహాల నిరోధక చట్టం చట్టం2006, పోక్స్ యాక్ట్, మానవ అక్రమ రవాణా నిషేధం, పిల్లల దత్తతు వంటి అంశాలపై వాల్ పోస్టర్ను డాక్టర్ రాజేష్ ఆవిష్కరించారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో బాల్య వివాహాలు చేయడం నేరమని, బాలల చట్టాలపై మేము కూడా సమావేశాలలో ప్రజలకు వివరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ సంస్థ మండల కమిటీ మొబిలైజర్ ఒగ్గు సోమన్న, హెచ్ఇఓ తాడూరి వెంకన్న, హెల్త్ సూపర్వైజర్స్ పూలమ్మ, వెంకన్న, ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల తనిఖీ

పెన్ పహాడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన డి ఎం హెచ్ ఓ చంద్రశేఖర్

ఆశ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ చంద్రశేఖర్

**పెన్ పహాడ్, అక్టోబర్ 07(జనంసాక్షి) :** మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ రాజేష్ ఆధ్వర్యంలో మంగళవారం ఆశ కార్యకర్తల సమావేశం నిర్వహించగా ఈ సమావేశానికి సూర్యాపేట జిల్లా వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ పాల్గొని మాట్లాడారు.పలు అంశాలపై ఆయన సమీక్ష నిర్వహించారు.ఇందులో భాగంగా ఏఎన్ సి రిజిస్ట్రేషన్ చేసే విధానం,ఎన్సిడి స్క్రీనింగ్ టెస్ట్, నిరోధక శక్తిపై అవగాహన సూచనలు చేశారు.అనంతరం రికార్డ్ లను పరిశీలించి జాతీయ ఆరోగ్య విధానాలన్నిటిని పై సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఈ ఓ వెంకన్న , హెల్త్ సూపర్వైజర్స్ ,. వెంకన్న , పూలమ్మ , ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు వైద్య సిబ్బంది పాల్గొన్నారు





# ప్రధాన న్యాయమూర్తిపై దాడి హేయమైనచర్య

**కోదాడ, అక్టోబర్ 7 (జనంసాక్షి):**
సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయి పై,న్యాయవాది దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించాలని కోదాడ బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. సోమవారం సుప్రీంకోర్టు లో సీజే పై దాడి ప్రయత్నంకు నిరసనగా మంగళవారం కోదాడ కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించినిరసన తెలిపారు.ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఉయ్యాల నర్సయ్య, ప్రధాన కార్యదర్శి రామిశెట్టి రామకృష్ణ మాట్లాడుతూ ప్రధాన న్యాయమూర్తి పై షూ విసరడం, , భారతదేశ సనాతన ధర్మంపై కామెంట్లను సహించనని నినాదాలు చేస్తూ దాడికి ప్రయత్నం చేసిన న్యాయవాది చర్య అనాగరికమని, మతభావజాల ఉన్మాద చర్య అన్నారు. రాజ్యాంగ ప్రాతిపదికన నడుస్తున్న న్యాయస్థానాలలో మతమౌఢ్య భావజాల పోకడలు పెరిగి, చట్టప్రకారం, రాజ్యాంగ ప్రకారం కాకుండా సనాతన, ఆచార,వ్యవహారాలతో కోర్టులు నడవాలనే విషపూరిత, విద్వేష భావజాలం తోనే ఇలాంటి ఉన్మాద చర్యలకు కారణం అవుతున్నాయన్నారు.ఈ చర్య భారత న్యాయవ్యవస్థ స్వతంత్ర రాజ్యాంగం, సెక్యులరిజంల పై జరిగిన దాడిగా భావించాలని,ఇలాంటి ఉన్మాద చర్యలను అందరూ తీవ్రంగా ఖండించాలని కోరారు. ఈ సంఘటనపై సమగ్ర విచారణ జరిపి, న్యాయవాదిపై సుమోటోగా కేసు నమోదు చేసి క్రిమినల్ చర్యలు చేపట్టాలని,అతని వెనక ఉన్న వారిపైన తగిన విచారణ జరిపి, కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేసారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు నాగుబండి కృష్ణమూర్తి, యడ్లపల్లి వెంకటేశ్వర్లు,కోడూరు వెంకటేశ్వర్లు కరీం,బండారు రమేష్,హుస్సేన్, నవీన్, ఎస్ వి చలం,కానుగు మురళి, పాలేటి నాగేశ్వరరావు,రంజాన్ పాషా,గట్ల నర్సింహారావు, రంగారావు,తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

## రైతులు నాణ్యత ప్రమాణలను పాటించి మద్దతు ధరను పొందాలి

### జిల్లా వ్యవసాయాదికారి పి.శ్రవణ్ కుమార్

**మాడ్గులపల్లి అక్టోబర్ 7 (జనంసాక్షి):**



మాడ్గులపల్లి మండలం గోపాలపురం గ్రామంలో రైతులు సాగు చేసినపంట పొలాలను మంగళవారం జిల్లా వ్యవసాయాదికారి పి.శ్రవణ్ కుమార్ సందర్శించారు. సందర్భంగా రైతులు సాగు చేసినపంట పొలాలనుపరిశీలించిరైతులసమస్యలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో వరి కోతలు ప్రారంభమై య్యాయని రైతులు పండించిన ప్రతి ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్ కమిటీలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఐకెపి ల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.. ప్రభుత్వం 2025-26 సంవత్సరానికి గాను వరి ఎ గ్రేడ్ రకానికి క్వింటాలు కి రూ. 2389, సాధారణ రకానికి రూ. 2369, కనీస మద్దతు ధర నిర్ణయిం చడం జరిగిందన్నారు. అంతే కాకుండా తెలంగాణ ప్రభుత్వం రైతులు పండించిన సన్న ధాన్యానికి ప్రోత్సహకంగా క్వింటాల్ కి రూ 500 లు బోనస్ ప్రకటించడం జరిగిందని ఆయన తెలిపారు. రైతులందరు కనీస మద్దతు ధరను పొందాలంటే తప్పనిసరిగా నాణ్యత ప్రమాణలను పాటించాలని తేమ శాతం 17 శాతం ఉండే విధంగా చూసుకొని వడ్లలో తాలు లేకుండాచూసుకోవాలని ఆయన సూచించారు .ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి యం.శివరాంకుమార్ ,వ్యవసాయ విస్తరణ అధికారులు వేణుగోపాల్ , లతో పాటు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి)**
:జిల్లా కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ కార్యాలయంలో నేడు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం సూర్యాపేట మండల అధ్యక్ష , కార్యదర్శులు దండ శ్యాంసుందర్ రెడ్డి, సుదగాని నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.శ్రీ కంటి హాస్పిటల్, సూర్యాపేట వారి సౌజన్యంతో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.ఈ వైద్య శిబిరంలో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. పెన్షనర్లు,ఆరోగ్యశ్రీ కార్డు కలిగిన వారు, రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగులు, జర్నలిస్టులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## అభ్యుదయ వాదులకు, కవులకు, కళాకారులకు, రచయితలకు, ఉద్యమ నేతలకు రక్షణ లేకుండా పోయింది

**భారత ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్‌పై ఓ మనువాద, మతోన్మాద న్యాయవాది దాడికి యత్నించిన ఘటనను తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ తరపున తీవ్రంగా ఖండించిన జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ**

**భువనగిరి, అక్టోబర్ 7(జనం సాక్షి)**



భారత ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్‌పై ఓ మనువాద, మతోన్మాద న్యాయవాది దాడికి యత్నించిన ఘటనను తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహాతెలియజేసినారు. దేశంలో బిజెపి అధికారం లోకి వచ్చిన తర్వాత అభ్యుదయ వాదులకు, కవులకు, కళాకారులకు, రచయిత లకు, ఉద్యమ నేతలకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. ఇప్పుడు అత్యున్నత వ్యక్తి అయినా సిజెఐపై కూడా దాడికి ప్రయత్నించడం ఆందోళనకరమైన ఘటన అన్నారు. దేశంలో సంఘ్ పరివార్ వ్యాప్తి చేస్తున్న మత విద్వేషాలను ప్రతిబింబిస్తోందని అన్నారు. ఈ ఘటనను వ్యక్తిగత చర్యగా తోసిపుచ్చడమంటే, పెరుగుతున్న అసహన వాతావరణాన్ని విస్మరించడమేనని అన్నారు. మతతత్వ మూఢత్వం సిజెఐని కూడా లక్ష్యంగా చేసుకోవడానికి ధైర్యం చేసిందంటే ఇది విభజన మరియు విషపూరిత రాజకీయాల తీవ్రమైన ప్రమాదాన్ని బహిర్గతం చేస్తోందని వాటిని నిస్సందేహంగా ఎదుర్కోవాలని అన్నారు. మతోన్మాదులతో, మనువాదులతో రాజ్యాంగానికి, అభ్యుదయ వాదులకు, అన్ని వర్గాల ప్రజలకు ప్రమాదం ఏర్పడిందని దీనికి వ్యతిరేకంగా ఐక్యంగా అన్ని వర్గాల ప్రజలు ఉద్యమించాలని నర్సింహ కోరారు.

## దేశద్రోహిగా పరిగణించి కఠినంగా శిక్షించాలి

### కట్టెల లింగస్వామి



**సంస్థాన్ నారాయణపురం. అక్టోబర్ 7. ( జనంసాక్షి):**
భారతదేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి( సిజెఐ ) జస్టిస్ గవాయ్ పై సనాతన ధర్మం పేరుతో దాడి చేసిన మతోన్మాది రాకేష్ కిషోర్ ని దేశద్రోహిగా పరిగణించి కఠిన శిక్ష విధించాలని జూనియర్ అడ్వకేట్ కట్టెల లింగస్వామి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.హిందూ మతోన్మాదం భారతదేశంలో రాజ్యాంగాన్ని తొలగించి మనుధర్మాన్ని తీసుకురావాలని చూస్తుంది. అందులో భాగమే ఈ దాడులు అని ఆయన అన్నారు. ప్రతిరోజూ హిందూ ధర్మం పేరుతో దేశంలో ఎక్కడో ఒకచోట ఈ దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న దళితులపై, స్త్రీలపై, మైనార్టీలపై రోజురోజుకు పెచ్చుమీరుతున్నాయి.ఈ మతోన్మాదులు నేడు ఏకంగా అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పైనే దాడికి తెగబడ్డారంటే, ఈ మతోన్మాదులు ఎంతకు బరి తెగించారో అర్థమైతుందన్నారు. దళితులపైన మైనార్టీలపైన తిండి పేరుతో దాడులు చేసి భయభ్రాంతులకు గురిచేస్తూ దేశంలో అలజడులను సృష్టిస్తున్నారన్నారు. ఈ రోజు దేశ ప్రధాన న్యాయ మూర్తి పైనే దాడికి బరితెగించారన్నారు. ఈ దాడి భారత న్యాయ వ్యవస్థ పైన, మరియు భారత రాజ్యాంగం పైన దాడిగా భావించాలని ఆయన అన్నారు. ఇలాంటి మతోన్మాదులను దేశద్రోహులుగా గుర్తించి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.



## మిర్యాలగూడ మున్సిపాలిటీలో ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి

**మిర్యాలగూడ, అక్టోబర్ 07,(జనంసాక్షి)**
మిర్యాలగూడ మున్సిపాలిటీలో మంగళవారం మహర్షి వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాస్,సిబ్బంది పూలమాలలు వేసి పుష్పాంజలి సమర్పించారు. రామాయణం వంటి మహా గ్రంథాన్ని రచించి, మానవ జీవన విధానానికి నైతిక విలువలను, అమూల్యమైన సాహిత్యాన్ని అందజేసిన ఘనత వాల్మీకిది అని అన్నారు. అందుకే ఆయన మహర్షి అయ్యారని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు,సిబ్బంది ఉన్నారు.

## భువనగిరి యూనిట్ పెన్షనర్స్ సంఘం కార్యవర్గం ఎన్నిక అధ్యక్షులుగా తాడూరు కృష్ణయ్య..



**భువనగిరి (జనంసాక్షి):**
భువనగిరి యూనిట్ పెన్షనర్స్ సంఘం సర్వసభ్య సమావేశం జిల్లా కేంద్రంలోని పెన్షనర్స్ భవనంలో నిర్వహించారు.ఈ సందర్భంగా యూనిట్ కార్యవర్గమును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా తాడూరు కిష్టయ్య జిల్లా కార్యదర్శిగా మాటూరి చంద్రయ్య ఫైనాన్స్ సెక్రటరీగా డి ఆగయ్య అసోసియేట్ అధ్యక్షులుగా భువనగిరి సత్యనారాయణ ఉపాధ్యక్షులుగా ఎండి దావూద్ అలీ ఉపాధ్యక్షురాలుగా పి శోభారాణి జాయింట్ సెక్రటరీగా వి ప్రదీప్ కుమార్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా టి నరసింహ స్వామి పబ్లిసిటీ సెక్రటరీగా మచ్చ ఆంజనేయులు జిల్లా కౌన్సిలర్ లు గా కే సత్యనారాయణ రెడ్డి కే రవీందర్ ఎ నారాయణ లను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు కే మోహన్ రెడ్డి మాజీ ప్రధాన కార్యదర్శి రేఖల ఆనందం ఎన్నికల అధికారి నరసింహారెడ్డి గౌరవ అధ్యక్షులు పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సిజెఐ పై దాడి చేయడం రాజ్యాంగంపై దాడి చేయడమే

దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయి పై ఒక న్యాయవాది బూటు తో దాడి చేయడం సమాజానికి సిగ్గుచేటు అన్నారు. ఇది భారత రాజ్యాంగం పైనే బూటు వేయడం అన్నారు. 75 ఏళ్ల రాజ్యాంగ పాలన లో గవాయి షెడ్యూల్ కేటగిరి నుంచి రెండోసారి దేశానికి ప్రధాన న్యాయమూర్తి అయ్యారన్నారు. అది కూడా పూర్తిగా సొంత అర్హతతోనే అన్నారు. ఈ ఘటన దేశంలోని మొత్తం షెడ్యూల్ కులాలపై దాడిగా చూడాలన్నారు. రాజ్యాంగాన్ని విశ్వసించే అన్ని రాజకీయ పార్టీలు ఈ ఘటన పై ఎదుర్కొనేందుకు ఐక్యంగా పోరాడాలన్నారు.ఈ నిరసన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కారింగుల వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రెటరీ పర్వీన్, జాయింట్ సెక్రెటరీ మల్లెపాక రవికుమార్, న్యాయవాదులు జిల్లా కుమారస్వామి, తాళ్లపల్లి సత్యనారాయణ, వంగాల నాగరాజు, ఓర్సు రాజు, షేక్ వజీర్, గుగులోతు రాజారాం, పులిచెర్ల శ్రీనివాస్, బానోతు ప్రతాప్ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.



# ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఆధార్ ఈ కేవైసి చేయించుకోవాలి

## ఉపాధి హామీ ఇంజనీర్ రూపావత్ బాలునాయక్



**మాడ్గులపల్లి అక్టోబర్ 7 (జనంసాక్షి):** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరు ఆన్ లైన్ లో ఆధార్ ఈ కేవైసీ చేయించుకోవాలని ఎన్ఆర్ఈజీఎస్ మండల ఇంజనీర్ రూపావత్ బాలునాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని తోపుచర్ల గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఈకేవైసీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి జాబ్ కార్డు లో ఉన్న ప్రతి ఒక్క సభ్యుడు ఆధార్ ఈకేవైసీ చేయించుకోవాలని, లేనట్లయితే ఉపాధి హామీ పథకం పనులు చేసేందుకు అర్హత కోల్పోవడంతో పాటు ఇప్పటివరకు ఉపాధి హామీ పథకంలో చేసిన పనులకు డబ్బులు రావని ఆయన తెలిపారు. అదే విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలకు ఉపాధి హామీ జాబ్ కార్డ్ అనుసంధానం చేస్తునందున మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరు తప్పనిసరి ఆధార్ ఈ కేవైసీ చేయించుకోవాలని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగి ఉన్నటువంటి లబ్ధిదారులకు మాస్టర్ ద్వారా 90 పని దినాలకు 27 వేల రూపాయలు ఇవ్వడం జరుగుతుందన్నారు. జాబ్ కార్డు కలిగివున్న ప్రతి ఒక్కరు ఉపాధి హామీ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ నిర్లక్ష్యం చేయకుండా ఆధార్ ఈకేవైసీని సమీపం లోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఉపాధి హామీ పథకానికి సంబంధించిన ఫీల్డ్ అసిస్టెంట్ లు ఆన్ లైన్ లో ఆధార్ ఈ కేవైసీ చేస్తున్నారని జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకురాలు వాంకుడోతు సరిత - జయేందర్, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు

**సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):** సంస్కృత భాషలో తొలి కావ్యమైన రామాయణాన్ని రచించిన మహర్షి వాల్మీకి ఆదికవి అని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ లో నిర్వహించిన మహర్షి వాల్మీకి జయంతి ఉత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం మాట్లాడుతూ మహర్షి వాల్మీకి దొంగ నుండి ఆదికవిగా మారి సమాజానికి ధర్మాన్ని చాటి చెప్పారన్నారు. శ్రీరాముని జీవిత చరిత్రను, ధర్మ మార్గాన్ని తన రామాయణం ద్వారా సమాజానికి తెలిపారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం మహర్షి వాల్మీకి జయంతిని అధికారికంగా నిర్గహిస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి చదువురాని వాల్మీకి తాను మహర్షిగా మారి రచించిన రామాయణంలోని భాష ఎంతో సామర్థ్యాన్ని కలిగి ఉందని, ఆనాటి భాషా సామర్థ్యాలను ఇప్పటికీ మనం వాడుతున్నామన్నారు. ఏ భాష అయినా విద్యార్థులు పూర్తిస్థాయిలో ఉపయోగించేలా మనం తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. మహర్షి వాల్మీకిని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరు ధర్మ మార్గాన్ని అనుసరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, జిల్లా,మండల అధికారులు పాల్గొన్నారు.



## ఘనంగా మహాత్మా వాల్మీకి జయంతి

హాలియా, అక్టోబర్ 7 జనంసాక్షి : హాలియా మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం మహాత్మా వాల్మీకి జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాలియా మున్సిపల్ కమిషనర్ ఎం. రామదుర్గారెడ్డి వాల్మీకి చిత్ర పటానికి నివాళులర్పించి మాట్లాడారు. మహర్షి వాల్మీకి జీవితం, ఆలోచనలు, సమాజానికి చేసిన సేవలను స్మరిస్తూ, ఆయన చూపిన నైతిక మార్గదర్శకాలు మనందరికీ ప్రేరణగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.





## సీజేఐపై దాడికి నిరసనగా కోర్ట్ విధుల బహిష్కరణ

**దేవరకొండ,అక్టోబర్ 07(జనంసాక్షి)** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్ పై దాడికి నిరసనగా మంగళవారం దేవరకొండ న్యాయవాదుల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు తమ విధులను బహిష్కరించారు. కోర్టు ప్రాంగణం ఎదుట న్యాయవాదుల నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఉమామహేశ్వర్, సీనియర్ అడ్వకేట్ గాజుల ఆంజనేయులు మాట్లాడుతూ న్యాయవ్యవస్థను దేశంలోని ప్రతి ఒక్కరూ గౌరవించాలని, కించపరిచే విధంగా ఎవరు వ్యవహరించినా చట్టపరంగా శిక్షార్హులే అవుతారని అన్నారు. దేశ అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తిపై దాడికి పాల్పడిన న్యాయవాదిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. న్యావాదులపై తరచూ గొడవలు జరుగుతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. న్యావాదులకు ప్రత్యేక రక్షణ చట్టాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నం

**చింతపల్లి, అక్టోబర్ 07(జనం సాక్షి)**



స్థానిక సంస్థల ఎన్నికల్లో 42% బీసీ బిల్లు వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్ను సుప్రీంకోర్టు కొట్టివేయడాన్ని స్వాగతిస్తున్నామని తెలంగాణ మలిదశ ఉద్యమ నాయకులు కాన్సిరాం యువసేన వ్యవస్థాపక అధ్యక్షులు భావండ్లపల్లి చెన్నయ్య అన్నారు..ఆయన మాట్లాడుతూ రేపు రాబోయే హైకోర్టు తీర్పు కూడా బీసీలకు అనుకూలంగా రావాలని చెప్పి కోరుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీవో తేవడాన్ని స్వాగతిస్తూ ఇదే బిల్లును రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కొనసాగే విధంగా అందరూ పాటుపడాలని చెప్పి కోరుకుంటూ బీసీల అనుకూల బిల్లును అడ్డుకునే వాళ్లను ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పేర్కొన్నారు...



# చట్టం చేసిన బీసీ బిల్లుకు అడ్డం పడుతున్న ఓసీలు

### బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి కృష్ణ

**మునుగోడు అక్టోబర్ 07(జనంసాక్షి):** చట్టం చేసిన బీసీ బిల్లుకు అడ్డుపడుతున్న ఓసీలకు నిరసనగా బీసీ రిజర్వేషన్ చట్టాన్ని గవర్నర్ ఆమోదించాలని మునుగోడు మండల కేంద్రం స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆదేశాల మేరకు బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి కృష్ణ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆనగంటి కృష్ణ,బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు గుంటోజు వెంకటాచారిలు మాట్లాడుతూ ఖబర్దార్ మాధవరెడ్డి మా బీసీల పట్ల మీ కుట్ర ను మానుకోవాలనీ హెచ్చరించారు,అలాగే కొంతమంది రిజర్వేషన్ వ్యతిరేకులు రెడ్డి జాగృతి నాయకులు కోర్టుకుపోయి రిజర్వేషన్ను అడ్డుకునే ప్రయత్నాలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. హైకోర్టు,సుప్రీంకోర్టులలో న్యాయమైన బీసీ రిజర్వేషన్ వాటాన్ని అడ్డుకోవాలని రిజర్వేషన్ వ్యతిరేకులు రెడ్డి జాగృతి నాయకులు చూడడం చాలా సిగ్గుమాలిన విషయం అని అన్నారు. 60 శాతం ఉన్నటువంటి బీసీలు స్థానిక ఎన్నికలలో సర్పంచులు,ఎంపిటిసిలు కౌన్సిలర్లు కావడం ఇష్టం లేక పిడికెడు శాతం ఉన్నటువంటి రెడ్డి సామాజిక వర్గానికి చెందినటువంటి మాధవరెడ్డి,గోపాల్ రెడ్డి బీసీల నోటి కాడి ముద్దను గుంజుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కొండ వెంకన్న,కొండా మల్లేష్,బక్క కృష్ణయ్య,పంతంగి వెంకన్న, తన్నీరు నందివర్ధన్,భానుప్రసాద్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## జస్టిస్ గవాయి పై దాడిని ఖండించిన బిఎస్ పి



**వేములపల్లి అక్టోబర్ 7 (జనంసాక్షి):** న్యాయవ్యవస్థలో అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి ఆర్ గావాయి పైసనాతనధర్మం ముసుగులో మనువాద మూకలు చేసిన దాడిని బహుజన్ సమాజ్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని ఆయనపై జరిగిన దాడి ప్రజాస్వామ్యంపై జరిగినదాడిగా పరిగనిస్తున్నామని బహుజన సమాజ్ పార్టీ మిర్యాలగూడ నియో జకవర్గ ఎన్నికల ఇంచార్జి పుట్టల దినేష్ అన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతదేశంలో దళిత బహుజనులకు అత్యున్నత పదవులు దక్కుతున్నప్పటికీ ఆధిపత్య కులాలు అగ్రవర్ణాలతో అవమానాలు ,దాడులు నేటికీ జరుగుతానే ఉన్నా యన్నారు. దీనికి ప్రత్యక్ష సాక్ష్యమే జస్టిస్ బిఆర్ గవాయిపై జరిగిన దాడి అన్నారు .దేశంలో దళిత బహుజనుల పై దాడులు జరగకుండా నియం త్రించాలంటే బహుజను లకు రాజ్యాధికారం దక్కడం ఒకటే అంతిమ పరిష్కారమన్నారు. దేశంలోని బహుజనులందరు ఈ సంఘటనతో మేలుకోని మనపై జరిగే దాడులు జరగకుండా ఉండాలంటే అక్క మాయావతి నాయకత్వంలో బహుజన్ సమాజ్.పార్టీని అధికారంలోకి తీసుకురావాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏనుగు గుర్తును తీసుకు వచ్చిన బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బడంగ్పేట్ మాజీ డిప్యూటీ మేయర్ ఇబ్రహీం శేఖర్ .కి ధన్యవాదాలు తెలియజేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా బహుజన సమాజ్ పార్టీ నాయకులు ఎంపిటిసి జడ్పిటిసి సర్పంచి అభ్యర్థులుగా బరిలో నిలపడం జరుగుతుందని ఆయనతెలిపారు. మిర్యాలగూడ నియోజకవర్గ ప్రజలు బీఎస్పీ నాయకు లను ఆదరించి ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు .ఈ సమావేశంలో మిర్యాలగూడ బిఎస్పి నియోజకవర్గ అధ్యక్షుడు అధ్యక్షుడు నాని నాగరాజు నియోజకవర్గ ఇన్చార్జిలు షేక్ గాలిబ్ , వట్టెపు అనిదీప్ రాజు, సీనియర్ నాయకులు కుందారపురమేష్ ,నియోజకవర్గ ఉపాధ్యక్షులు తమ్మన రాజేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శి మోత విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

# సుప్రీంకోర్టు సీజేఐ జస్టిస్ గవాయిపై దాడి అవివేకం

## కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు యేకుల సురేష్



**కొండమల్లేపల్లి, అక్టోబర్ 07 (జనంసాక్షి):** భారత సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్.గవాయిపై కోర్టు హాలులో జరిగిన దాడి ప్రయత్నం ఘటనను కేవలం న్యాయ వ్యవస్థపై దాడిగా, ఆయన దళిత సామాజిక వర్గం నుండి దేశంలో అత్యున్నత రాజ్యాంగ పదవిని అధిరోహించడం వల్లే లక్ష్యంగా చేసుకున్నారనే కుల దురభిమానం కోణంలో జరిగిందని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నల్గొండ జిల్లా ఉపాధ్యక్షుడు యేకుల సురేష్ ఈ చర్యను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఈ దాడి రాజ్యాంగం అణగారిన వర్గాల ఆత్మగౌరవంపై జరిగిన దాడిగా అభివర్ణించారు. జస్టిస్ గవాయి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వారసత్వాన్ని అందిపుచ్చుకుని అత్యంత గౌరవప్రదమైన స్థానంలో ఉన్నారని, ఆయనపై దాడి చేయడం వెనుక కుల అసహనం ఉందనే బలమైన అనుమానాన్ని దేశం పరిశీలించాలని ఆయన అన్నారు. ఒక దళితుడు అత్యున్నత పదవిలో ఉంటే అతడిపై దాడులు చేస్తారా అని ఈ చర్య పరోక్షంగా ప్రశ్నిస్తోందని సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పిరికిపంద చర్యలతో దేశంలో దళితులు అణగారిన వర్గాలు రాజ్యాంగ పదవులను దక్కించుకోవడాన్ని ఎవరూ అడ్డుకోలేరని యేకుల సురేష్ స్పష్టం చేశారు. రాజ్యాంగం అందించిన హక్కులు వారి సమర్థత ద్వారానే జస్టిస్ గవాయి వంటి నాయకులు ఉన్నత శిఖరాలను అధిరోహించారని ఆయన గుర్తు చేశారు. ఈ దాడులు వారి నిబద్ధతను, ధైర్యాన్ని ఏమాత్రం ప్రభావితం చేయలేవని, యావత్ దేశం ఈ దాడిని అణగారిన వర్గాల ప్రతినిధిపై జరిగిన దాడిగా పరిగణించి ఖండించాలని ఆయన కోరారు. దాడి యత్నం జరుగుతున్న సమయంలో కూడా చలించకుండా విచారణ కొనసాగించిన జస్టిస్ గవాయి ధైర్యాన్ని వృత్తి నైపుణ్యాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ చర్య వారి నిస్వార్థ సేవకు, రాజ్యాంగంపై వారికున్న అచంచలమైన విశ్వాసానికి నిదర్శనమని అయన కొనియాడారు. న్యాయవ్యవస్థపై దాడి చేసేవారికి కోర్టు ధిక్కార చట్టాలు బార్ కౌన్సిల్ ద్వారా అత్యంత కఠినమైన శిక్షలు విధించి ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా గట్టి హెచ్చరిక జారీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా న్యాయమూర్తుల గౌరవమే రాజ్యాంగం యొక్క గౌరవమని ఆయన నొక్కి చెప్పారు.

# బీసీ రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించి బీసీల ఆగ్రహానికి గురికావద్దు

## బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు పుట్ట వెంకన్న గౌడ్



**మాడ్గులపల్లి అక్టోబర్ 7(జనంసాక్షి):** బీసీ రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించి బీసీల ఆగ్రహానికి గురికావద్దని,గవర్నర్ బీసీ రిజర్వేషన్ బిల్లును వెంటనే ఆమోదించాలని బీసీ సంక్షేమ సంఘం నల్లగొండ పట్టణ అధ్యక్షుడు పుట్ట వెంకన్న గౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూబీసీ రిజర్వేషన్ల బిల్లును గవర్నర్ఆమోదించకుండా, బిసి రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకిస్తు ,కొంతమంది రెడ్డి జాగృతి నాయకులు కోర్టుకు వెళ్లి బిల్లును అడ్డుకునే ప్రయత్నాలు చేయడాన్నిఆయన తప్పుపట్టారు. హైకోర్టు, సుప్రీంకోర్టులలో న్యాయమైన బీసీ రిజర్వేషన్ల వాటాను అడ్డుకోవాలని రిజర్వేషన్ల వ్యతిరేకులు ప్రయత్నం చేయడం సిగ్గుమాలిన చర్య అన్నారు. జనాభాలో 60 శాతం ఉన్న బీసీలు స్థానిక ఎన్నికలలో సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు కావడం ఇష్టంలేకనే పిడికెడు శాతం ఉన్న రెడ్డి సామాజిక వర్గానికి చెందిన మాధవరెడ్డి, గోపాల్ రెడ్డి లు బీసీల నోటికాడి ముద్దను గుంజుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు . తెలంగాణ అసెంబ్లీలో చట్టం చేసిన బీసీ బిల్లును గవర్నర్ ఆమోదించకుండా ఉండడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా గవర్నర్ సకలజనుల సంక్షేమ ని దృష్టిలో పెట్టుకొని వెంటనే బీసీ రిజర్వేషన్ బిల్లును యధావిధిగా ఆమోదముద్ర వేయాలని ఆయన కోరారు.

# చేకూరి కుటుంబాన్ని పరామర్శించిన రాష్ట్ర నాయకులు సాధు రమేష్ రెడ్డి

**ఖమ్మం, (జనం సాక్షి):** ఖమ్మం రూరల్ గుదిమల్ల గ్రామంలో సీనియర్ నాయకులు చేకూరి తిరుపతయ్య ఇటీవల పరమపదించారు. విషయం తెలుసుకొని వారి కుటుంబ సభ్యులను రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు సాదు రమేష్ రెడ్డి మంగళవారం పరామర్శించారు. వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.





# మృతుని కుటుంబానికి గౌసుద్దీన్ చేయూత

## ప్రజా సేవకుడు గౌసుద్దీన్

కారేపల్లి, అక్టోబర్07(జనంసాక్షి) : కారేపల్లిలో మృతిని కుటుంబానికి కారేపల్లికి చెందిన స్వచ్ఛంధ సేవకుడు ఎస్కె.గౌసుద్దీన్ మంగళవారం వర్ధిక సాయం అందజేశారు. కారేపల్లికి చెందిన ముసుకుల కనకరాజు ఇటీవల మృతి చెందాడు. ఇంటికి పెద్దదిక్కు కోల్పోవటంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న బాధిత కుటుంబాన్ని ఓదార్చిన గౌసుద్దీన్ రూ.5వేల నగదు అందజేశారు. కారేపల్లిలో ఏ కుటుంబానికి ఆపద వచ్చినా కులమతాలకు అతీతంగా తానున్నాంటూ ముందుకు వచ్చి సాయం అందిస్తూ మానవత్వం చాటుతున్న గౌసుద్దీన్ సేవానిరతిని గ్రామస్తులు అభినందిస్తున్నారు. ఈకార్యక్రమంలో గ్రామపెద్దలు ఈ కార్యక్రమంలో డొంకెనరవీందర్ గౌడ్, అబ్దుల్ వాహెద్, అజార్, సద్దాం, ముస్తాక్, ఆనందరావు సతీష్,నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

# హక్కుల కోసం కొమరం భీమ్ స్ఫూర్తితో పోరాటం

## కారేపల్లిలో ఘనంగా కొమరం భీమ్ వర్ధంతి



**కారేపల్లి, అక్టోబర్07(జనంసాక్షి) :** ఆదివాసీలపై నిర్భంధాలు, వివక్షతపై మరో పోరాటానికి సమాయత్తం కావాలని తుడుందెబ్బ ఖమ్మం జిల్లా అధ్యక్షులు బచ్చల వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం కొమరం భీమ్ 85వ వర్ధంతిని కారేపల్లిలో ఘనంగా నిర్వహించారు. కారేపల్లి కొమరం భీమ్ సెంటర్లోని విగ్రహానికి, తుడుందెబ్బ కార్యాలయంలో కొమరం భీమ్ చిత్రపటానకి ఆదివాసీ నాయకులు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈసందర్భంగా తుడుందెబ్బ నాయకులు మాట్లాడుతూ అడవులపై ఆధారపడి జీవనంసాగిస్తున్న ఆదివాసీలపై నిర్భంధాలు విధిస్తుండటతో వారి అస్తిత్వాన్ని ప్రమాదం వచ్చిందన్నారు. రాజకీయ పక్షాలు ఓట్ల రాజకీయంతో ఆదివాసీలపై వివక్షత సాగిస్తున్నారని దీనిపై కొమరం భీమ్ స్ఫూర్తితో ఐక్య పోరాటాలతో బుద్ధి చెప్పాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కల్తీ రాంప్రసాద్, కార్యదర్శి ఈసాల రాంబాబు, మాజీ సర్పంచ్లు కుర్సం సత్యనారాయణ, సాగబోయిన వెంకటమ్మ, తుడుందెబ్బ మండల నాయకులు యదళ్లపల్లి శీను, తాటి రామారావు, దారం సహదేవులు, ఈసాల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పత్తిలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

## మండలంలో పంటలను పరిశీలించిన డీఏవో

**కారేపల్లి, అక్టోబర్07(జనంసాక్షి) :** అకాల వర్షాలతో పత్తి మొక్కలు ఎర్రబారటం, కాయ కుళ్లు వంటివి కనిపిస్తున్నాయని వాటి నివారణ సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి దనసరి పుల్లయ్య అన్నారు. కారేపల్లి మండలం మాణిక్యారం ప్రాంతంలో మంగళవారం పత్తి చేలను వ్యవసాయాధికారులు పరిశీలించారు. ఈసందర్భంగా రైతులు సూచనలు చేశారు. చేనులో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. మొక్కకు పోషకాలు అందించటం ద్వారా నష్ట నివారణ చర్యలు చేపట్టవచ్చన్నారు. యూరియా కొరత లేదని, కొరత పేరుతో అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధిక నత్రజని వినియోగంతో పంటలకు చీడపీడలు అధికంగా సోకటంతో పాటు మానవుల ఆరోగ్య పరంగానే కూడా ఎంతో అనార్థమన్నారు. అనంతరం మండలంలోని పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. రైతుల ఆధార్ కార్డులను పీవోఎస్ మిషన్ల లో నమోదు చేయటం ద్వారానే ఎరువుల అమ్మకం చేపట్టాలని డీలర్లకు సూచించారు. పంటల నమోదును తప్పని సరిగా చేసుకోవాలని, పత్తి అమ్మకానికి రైతులు కపాస్ కిసాన్ యాఫ్ ను వినియోగించాలని, దానిపై స్థానిక విస్తరణ అధికారులను సంప్రదించాలని కోరారు. రైతులకు అందుబాటులో అన్ని రకాల ఎరువులు ఉన్నాయని తెలియజేశారు. డీఏవో వెంట ఏవో బట్టు అశోక్ కుమార్, ఏఈవోలు బీ.నరేష్, జీ.మహేష్, ప్రమీల, మున్ని, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.



# జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం



ఖమ్మం, (జనంసాక్షి): దేశ న్యాయ వ్యవస్థలో అత్యున్నత స్థానంలో ఉన్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయిపై సనాతన ధర్మం ముసుగులో నిన్న జరిగిన మనువాద దాడిని బహుజన్ సమాజ్ పార్టీ ఖమ్మం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా జిల్లా కేంద్రం లో జరిగిన సమావేశం లో జిల్లా అధ్యక్షులు చెరుకుపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ దాడి దేశ న్యాయ వ్యవస్థ చరిత్రలో ఒక చీకటి రోజు.భారత రాజ్యాంగం, న్యాయ వ్యవస్థ స్వతంత్రత,లౌకిక ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగానే పార్టీ భావిస్తుందన్నారు. ఈ దేశంలో దళితులకు అత్యున్నత పదవులు దక్కుతున్నప్పటికీ, ఆధిపత్య కులాల నుండి అవమానాలు మాత్రం తప్పడం లేదన్నారు. దీనికి ప్రత్యక్ష సాక్ష్యమే జస్టిస్ బి.ఆర్.గవాయిపై జరిగిన దాడి అన్నారు. దేశంలో వేల ఏళ్లుగా అవమానాలకు గురవుతున్న జాతులకు ఆత్మగౌరవం దక్కాలంటే రాజ్యాధికారం దక్కాలని, రాజ్యాధికారం దక్కనంతకాలం మన జాతులకు అవమానాలు, అణిచివేతలు,దాడులు తప్పవని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతకాలం అవమానాలు, అణిచివేతలకు గురైన వర్గాల ప్రజలే ఇప్పుడు దేశాన్ని పాలించాల్సిన అవసరం ఉంద న్నారు. అప్పుడు మాత్రమే మన జాతులకు సామాజిక న్యాయం, ఆత్మగౌరవం దక్కుతుందని అన్నారు.ఈ దాడికి పాల్పడిన వ్యక్తిపై దేశద్రోహం కేసు నమోదు చేసి తక్షణమే శిక్షించాలని బహుజన్ సమాజ్ పార్టీ ఖమ్మం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు అడ్వకేట్ వేల్పుల రామయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మిరియాల నాగరాజు,జిల్లా కార్యదర్శి బుర్ర ఉపేందర్, జిల్లా కమిటీ నాయకులు పల్లెపొంగు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం

దమ్మపేట అక్టోబర్ 7 (జనంసాక్షి): దమ్మపేట మండలం మందలపల్లి గ్రామంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని దమ్మపేట పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఒకవేళ తెలియకుండా సైబర్ నేరాలు బారిన పడితే ముందుగా స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన యడల తమ నగదుకు తగిన భద్రత కల్పించబడుతుందని, సైబర్ నెరగాళ్ళు మోసం చేయడానికి అనేక రకాల మార్గాలను ఎంచుకుంటారని,మోసపూరితమైన లింకులను ఓపెన్ చేసి సైబర్ నేరాల పట్ల గురికాకుండా ఉండాలని ప్రతి ఒక్కరూ సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో దమ్మపేట రెండవ ఎస్సై బాలస్వామి,మూడవ ఎస్సై రాఘవయ్య, పోలీస్ సిబ్బంది రెడ్డి,రాజేష్,నాగ ముత్యం,గ్రామ ప్రజలు యువత పాల్గొన్నారు.

# వ్యవసాయ కార్మికుల అభివృద్ధికి సమగ్ర చట్టాలు చేయాలి



ఖమ్మం, (జనం సాక్షి): పట్టణ ప్రాంతాల్లో కూడా ఉపాధి హామీ పనులు కల్పించాలి. మెరుగు సత్యనారాయణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు. యర్రా శ్రీనివాసరావు రాష్ట్ర కమిటీ సభ్యులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగంపై కేంద్రీకరించాలి ప్రత్యేక నిధులు కేటాయించి వ్యవసాయ కూలీలకు నిరంతరం పని కల్పించాలి వ్యవసాయ కూలీల అభివృద్ధికి సమగ్ర చట్టాలు చేయాలి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు చేసిన ఆరు గ్యారెంటీలను సంపూర్ణంగా అమలు చేయాలి దానిలో భాగంగానే వ్యవసాయ కార్మికులకు సంవత్సరానికి 12,000 అందిస్తాం అన్న వాగ్దానం అమలు చేయాలని పట్టణ ప్రాంతాలలో ఉపాధి పని కల్పిస్తూ సంవత్సరానికి 150 రోజులు పని కల్పిస్తూ రోజుకి 400 రూపాయలు వేతనం ఇస్తామన్న రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి చేసిన వాగ్దానం అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మెరుగు సత్యనారాయణ రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని కోరారు. ఈరోజు సుందరయ్య భవనాలు వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం డివిజన్ కమిటీ సమావేశం డివిజన్ అధ్యక్షులు ఎస్.కె ఇమామ్ అధ్యక్షతన జరిగింది ఈ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ అత్యంత నిరుపేదలైన వ్యవసాయ కూలీలు ఆర్థికంగా విద్యాపరంగా ఆరోగ్యపరంగా వెనకబడి ఉంటున్నారని వ్యవసాయ పనులు సంవత్సరం మొత్తం దొరకకపోగా ఇతర గ్రామీణ పనులు లేకపోవడం ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు ప్రభుత్వాలు నిరుపేదలు చేసిన వాగ్దానాలు అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయి అనేక గ్రామాలను పట్టణాలలో కలుపుతూ గ్రామీణ ప్రాంతంలో దొరుకుతున్న ఉపాధి పని తీసివేయటం జరుగుతున్నది దీని ఫలితంగా వేలాది మందికి ఉపాధి కోల్పోయి ఆర్థికంగా ఇబ్బంది పడుతూ కొనుగోలు శక్తి క్షీణిస్తున్నది దీని ఫలితంగా ఆర్థిక సంక్షోభం వస్తున్నది కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ కార్మికులకు వ్యవసాయ రంగాన్ని అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి కేంద్ర రాష్ట్ర బడ్జెట్లో అధిక నిధులు కేటాయించాలని సంవత్సరం పొడుగునా ఉపాధి పనులు కల్పించాలని ఇల్లు లేని నిరుపేదలకు ఐదు లక్షల రూపాయలు మంజూరు చేసి ఇళ్ల నిర్మాణం చేపట్టాలని అర్హత కలిగిన వారందరికీ పింఛన్లు రేషన్ కార్డులు మంజూరు చేయాలని గతంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పింఛన్ల పెంపును వెంటనే అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ ఈనెల 10వ తేదీన ఖమ్మం అర్బన్ కార్యాలయం వద్ద జరుగు ధర్నాను జయప్రదం చేయాలని . కోరారు ఇంకా ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం డివిజన్ కార్యదర్శి పడిగెల నాగేశ్వరరావు గద్దల రత్తమ్మ తీగల వెంకటేశ్వర్లు గద్దల పెంటయ్య ఎస్కే రహీం మొర్రి మేకల ప్రసాద్ వెంకట్ రాములు వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి ఖమ్మం జిల్లా కార్యదర్శిగా కుంచం



మధిర, అక్టోబర్ 7 (జనంసాక్షి): మధిర పట్టణమునకు చెందిన రాష్ట్ర ఆర్యవైశ్య నాయకులు, బిజెపి సీనియర్ నాయకులు, సామాజిక సేవకులు, జాతీయవాది, ఆధ్యాత్మికులు కుంచం కృష్ణారావును బిజెపి జిల్లా కార్యదర్శిగా నియమిస్తూ ఖమ్మం జిల్లా బిజెపి అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కుంచం కృష్ణారావు మాట్లాడుతూ నాపై నమ్మకంతో జిల్లా కార్యదర్శిగా బాధ్యత ఇచ్చిన జిల్లా అధ్యక్షులు శ్రీ నెల్లూరి కోటేశ్వరరావు , రాష్ట్ర అధ్యక్షులు శ్రీ నారపరాజు రామచంద్రరావు, జాతీయ నాయకులు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల సహ ఇన్చార్జి శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి గార్లకు కృతజ్ఞతలు తెలియజేస్తూ జిల్లాలో పార్టీ బలోపేతానికి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో క్రమశిక్షణతో, కష్టపడి పనిచేసి మెజార్టీ స్థానాలు గెలిచే విధంగా కృషి చేస్తానని తెలియజేశారు. నాకు ఈ పదవి రావడానికి నాపై విశ్వాసంతో సహకరించిన బిజెపి రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు, బిజెపి రాష్ట్ర నాయకులు ఉదయ ప్రతాప్, బిజెపి జిల్లా సీనియర్ నాయకులు మందడపు సుబ్బారావు , మంద పాపారావు, మద్దినేని వెంకటేశ్వర్లుకి ధన్యవాదాలు తెలియజేశారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

### సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు




ఖమ్మం రూరల్,అక్టోబర్ 07:(జనం సాక్షి) రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐఎంఎల్ మాస్ లైన్ అభ్యర్థులు తమ సత్తా చాటి ప్రజల సమస్యల పరిష్కారమే ఎజెండాగా పనిచేయాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు పిలుపునిచ్చారు .మంగళవారం ఖమ్మం మండల పరిధిలోని ఎం. వెంకటాయపాలెం గ్రామంలో ఆ పార్టీ మండల కార్యదర్శి ఎడ్లపల్లి ఉపేందర్ అధ్యక్షతన జరిగిన ఎన్నికల సన్నాహక జనరల్ బాడీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పాలక పార్టీలు డబ్బు ,కులం ,మతం ప్రాతిపదికన ఎన్నికలలో పోటీ చేయాలని చూస్తున్నాయని వాటిని ఎదుర్కోవాలంటే ప్రజల సమస్యలే ప్రధానంగా ఎంచుకొని మాస్ లైన్ ముందుకు వెళ్లాలని కోరారు. పార్టీ ప్రతిష్టను కాపాడుతూ పార్టీ ఔన్నత్యాన్ని రక్షించుకోవాల్సిన అవసరం కార్యకర్తలపై ఉందన్నారు .పదవులపై వ్యామోహం కాకుండా ప్రజలకు సేవ చేయాలని లక్ష్యంతో ముందుకు వెళితే ప్రజల మద్దతు ఉంటుందన్నారు .ఎన్నికల్లో ప్రధానంగా ప్రజల సమస్యలను ఎజెండాగా పేర్కొంటూ ముందుగా వెళ్లాలని కోరారు .రానున్న ఎన్నికల్లో మాస్ లైన్ ప్రధాన పాత్ర పోషించాలని రంగారావు కోరారు. గ్రామపంచాయతీలకి పాలక పార్టీలు నిధులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడం వలన గ్రామ ప్రజలు అనేక రకాల ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.స్థానిక సంస్థలకు సకాలంలో ఎన్నికలు నిర్వహించకపోవడం వలన ప్రజా పరిపాలన మందగించిందన్నారు .ఫలితంగా గ్రామీణ ప్రజలు అనేక అవస్థలు గురయ్యారని తెలిపారు .గత పాలకుల నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా రేవంత్ రెడ్డిని గెలిపిస్తే అతను సైతం ప్రజా సంక్షేమాన్ని విస్మరించారని దుయ్యబట్టారు .కులం మతం వర్గం డబ్బు వ్యామోహాలకు దూరంగా మాస్ లైన్ కార్యకర్తలు స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేసి ప్రజల మద్దతును కూడగట్టుకోవాలని కోరారు .పార్టీ పటిష్టతకు భంగం కలిగించకుండా నీతి నిజాయితీగా ప్రజల్లో నిలబడాలని తెలిపారు .మాస్ లైన్ పార్టీ తెలంగాణ వ్యాప్తంగా 90 గ్రామపంచాయతీలలో 50 ఎంపీటీసీలలో 20 జడ్పిటిసి స్థానాలకు పోటీ చేయాల నిర్ణయించిందన్నారు .మాస్ లైన్ పార్టీ కార్యకర్తలను గెలిపించాలని రంగారావు పిలుపునిచ్చారు .మాస్ లైన్ రాష్ట్ర నాయకులు గుర్రం అచ్చయ్య మాట్లాడుతూ రూరల్ మండలంలో మాస్ లైన్ కు ప్రత్యేక స్థానం ఉందని అన్నారు.మండలానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రప్పించడంలో, ప్రజా సమస్యలపై ఉద్యమించడంలోమాస్ లైన్ ఎల్లప్పుడూ ముందు వరుసలో ఉందన్నారు .రిజర్వేషన్లు ఏ విధంగా ఉన్నప్పటికీ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు . ఈ సమావేశంలో మాస్ లైన్ పాలేరు డివిజన్ కార్యదర్శి బందెల వెంకయ్య ,డివిజన్ నాయకులు మలీదు నాగేశ్వరరావు ,కుర్ర వెంకన్న ,రెంటాల యాదగిరి ,వీర్ల వెంకట అప్పారావు ,పూలమ్మ,పుచ్చకాయల శ్రీను,రమేష్,వెంకన్న,పాలు తదితరులు ప్రసంగించారు.

### మాస్ లైన్ లో చేరికలు

కాచిరాజు గూడెం లో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కి చెందిన మహంకాళి అలివేలు ,భయ్యా వెంకన్న ,గోను చంద్రయ్య ,చెన్న బోయిన భాస్కర్ తో పాటు మరి కొందరు కార్యకర్తలు మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు సమక్షం లో మాస్ లైన్ పార్టీలో చేరారు .వారందరికీ పార్టీ జెండాలు మెడలో వేసి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# కలెక్టర్‌ను కలిసిన టిజీవో నేతలు



**ఖమ్మం, (జనంసాక్షి):** ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ని జిల్లా టీజీవో అధ్యక్షులు కొంగర వెంకటేశ్వరరావు, కార్యదర్శి మోదుగు వేలాద్రి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షులు కొంగర వెంకటేశ్వరరావు నీ, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ మల్లెల రవీంద్రప్రసాద్ నీ , ట్రెజరర్ సూరంపల్లి రాంబాబు నీ , టీజీవో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గా కొండపల్లి శేషు ప్రసాద్ నీ కలెక్టర్ కు పరిచయం చేశారు. కలెక్టర్ వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టీజీవో కార్యాలయానికి స్థలం కోసం గతంలో పలుమార్లు దరఖాస్తు పెట్టుకోవడం జరిగింది. ఇప్పటివరకు కూడా ముందుకు సాగలేదు. తాత్కాలికంగా కేటాయించిన ప్రస్తుత బిల్డింగ్ నీ కేటాయించవలసిందిగా రిప్రజెంటేషన్ నూ నాయకులు కలెక్టర్ కు అందించారు. ప్రస్తుతానికి ఉద్యోగుల సమస్యల పైన వచ్చిన వారికి తాత్కాలికంగా ఐడిఓసీలో ఒక రూమ్ నీ కేటాయించవలసిందిగా కోరగా సానుకూలంగా స్పందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీజీవో హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ పి విజయ్ కుమార్, తెలంగాణ అగ్రికల్చర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు భాస్కర్ రావు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ హరీష్, డాక్టర్ రాకేష్ కుమార్ , జిల్లా కార్యవర్గ సభ్యులు తాజుద్దీన్, అరుణకుమారి, అరుణ జ్యోతి, కరుణ శ్రీ, బి. కిషోర్ ఉమా మహేశ్వర్ రెడ్డి, పవన్ కుమార్ డాక్టర్ కే. కిరణ్ కుమార్‌డాక్టర్ పి రవికుమార్ తదితరులు ఉన్నారు.

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ఆపివేయాలనుకునే ఆలోచనను వెంటనే మానుకోవాలి

**యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద బిసి సంక్షేమ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో "నిరసన" కార్యక్రమం జిల్లా అధ్యక్షులు కొత్త నరసింహస్వామి**



**భువనగిరి, అక్టోబర్ 7 (జనంసాక్షి):**
యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద బిసి సంక్షేమ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో "నిరసన" కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు కొత్త నరసింహస్వామి, అధ్యక్షత వహించి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అన్ని రాజకీయ పార్టీల మద్దతుతో శాసనసభలో చట్టం చేసి, కొద్ది రోజుల్లోనే స్థానిక సంస్థల ఎన్నికలు 42% తో జరుగనున్నాయని, బీసీలంతా అనుకుంటున్న సమయంలో, కొందరు రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు.. బీసీల 42 శాతం రిజర్వేషన్లను అడ్డుకోవలనే, దురుద్దేశంతో హైకోర్టు కోసం సుప్రీంకోర్టుకు వెళ్లడం, బీసీల 42 శాతం రిజర్వేషన్లను ఆపివేయాలనుకునే ఆలోచనను వెంటనే మానుకోవాలని, రాష్ట్ర గవర్నర్ దగ్గర ఉన్న రిజర్వేషన్ సంతకం చేయాలని సంక్షేమ సంఘం ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు సాబన్ కార్ వెంకటేష్ , ఆలేరు నియోజకవర్గం అధ్యక్షులు పేరపు రాములు, వలిగొండ మండలం అధ్యక్షులు సాయిని యాదగిరి, విశ్వకర్మ సంఘం జిల్లా అధ్యక్షులు డిఎన్ చారి, జిల్లా మనమయ సంఘం అధ్యక్షులు ఉపేంద్ర చారి, సత్యనారాయణ, రమేష్, తదితర బీసీ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# తెలంగాణ జాగృతి జిల్లా ఉపాధ్యక్షురాలుగా నీలా ఉమారాణి



**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):** తెలంగాణ జాగృతి జిల్లా ఉపాధ్యక్షురాలుగా సూర్యాపేట పట్టణానికి చెందిన నీల ఉమారాణిని తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నియమించినట్లు జిల్లా అధ్యక్షురాలు కృష్ణవేణి ఇస్మాయిల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నీలా ఉమారాణి మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. తనపై ఎంతో నమ్మకం ఉంచి తనకు జిల్లా ఉపాధ్యక్షురాలుగా నియామకం చేసిన వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా జాగృతి అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. జాగృతి నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేస్తానని చెప్పారు. కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు.



# ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు జరిగేలా చూడాలి

## డిఎంహెచ్ఓ డాక్టర్ మనోహర్

**రామన్నపేట, అక్టోబర్ 7 (జనంసాక్షి):**
ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు జరిగేలా వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని డి ఎం హెచ్ ఓ డాక్టర్ మనోహర్ సూచించారు. మంగళవారం మండలంలోని మునిపంపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ డే మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డి ఎం హెచ్ ఓ పాల్గొని మాట్లాడుతూ.. గర్భిణులకు సలహాలు, సూచనలు ఇస్తూ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చేలా చూడాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య పెంచి, ప్రైవేట్ హాస్పిటల్ లో తగ్గించే విధంగా చూడాలన్నారు. పిల్లలందరికీ వాక్సిన్ సరియైన సమయంలో వేయాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు చేయాలన్నారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధులు నిర్వహిస్తేనే ప్రజలకు మనపై విశ్వాసం పెరుగుతుందన్నారు. టీబీ పేషెంట్లను రెగ్యులర్గా మానిటర్ చేయాలని, బిపి షుగర్ పేషెంట్స్ ని రెగ్యులర్గా ఫాలోఅప్ చేసి వారికి సరైన మందులు అందించాలని సూచించారు. కార్యక్రమంలో పి ఓ ఎన్ సి డి ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుమన్ కళ్యాణ్, మండల వైద్యాధికారి అశ్విని కుమార్, ఎం.ఎల్.హెచ్.పి లు, సూపర్వైజర్స్, ఏఎన్ఎం లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# గంధం రామకృష్ణ అంతిమయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

## పెద్ద ఎత్తున తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు

**మిర్యాలగూడ, అక్టోబర్ 07,(జనంసాక్షి)**
మిర్యాలగూడ పట్టణంలో గుండెపోటుతో హఠాన్మరణం పొందిన 14వ వార్డు తాజా మాజీ కౌన్సిలర్ గంధం రామకృష్ణ అంతిమయాత్రను మంగళవారం మిర్యాలగూడ పట్టణంలో నిర్వహించారు. ఆత్మీయ సహచరుడికి మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ( బిఎల్ఆర్ ), ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్, రాష్ట్ర నాయకుడు ధీరావత్ స్కైలాబ్ నాయక్ లు ఘనంగా నివాళులర్పించి అంతిమయాత్రలో పాల్గొన్నారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. రాంనగర్ ఇంటి నుండి పట్టణంలో ర్యాలీగా బయలుదేరి తాళ్లగడ్డ స్మశాన వాటికలో రామకృష్ణ పార్థివదేహానికి అంతిమ సంస్కారాలు సాంప్రదాయ రీతిలో నిర్వహించారు. ఎమ్మెల్యే అనుచరుడుగా, అందరితో ఆప్యాయంగా వ్యవహరించే రామకృష్ణను కడసారి చూసేందుకు కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి అశ్రునయనాలతో అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి, గాయం ఉపేందర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొదిల శ్రీనివాస్, డిసిసి ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలకృష్ణ, పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజార్, మాజీ కౌన్సిలర్లు దేశిడి శేఖర్ రెడ్డి, క్రికెటర్ జానీ, ఆలగడప గిరి, గోదాల జానకిరామ్ రెడ్డి, బెజ్జం సాయి, కాంగ్రెస్ నాయకులు బిఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.



# ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో హరి ఓమ్ కు ఘనంగా నివాళులు



భువనగిరి, అక్టోబర్ 7(జనం సాక్షి)
భారత జాతీయ విద్యార్థి సంఘం ఎన్ ఎస్ యు ఐ భువనగిరి అసెంబ్లీ అధ్యక్షులు గొల్లపల్లి వినయ్ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి మసూద్ ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో ప్రగతి నగర్ పద్మజ హాస్పిటల్ వద్ద ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో రాయెబరేలి లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్త రాహుల్ గాంధీ వీరాభిమాని అయిన హరి ఓమ్ ను కొందరు మతోన్మాదులు మూక హత్య చేయడాన్ని నిరసిస్తూ హరి ఓమ్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ అబ్జర్వర్ పోత్నక్ ప్రమోద్ కుమార్ మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్ పాల్గొని నివాళులర్పించి మాట్లాడుతూ దళిత యువకుడైన హరియోంను మూకదాడిలో చంపి హత్య చేసిన కేసులోఎన్ ఎస్ యు ఐ దేశవ్యాప్తంగా వీధుల్లోకి వచ్చి న్యాయం కోసం పోరాడుతుంది. యోగి ఆదిత్యనాథ్ పాలనలో బహుజనుల హత్యలను ఇక సహించబోము. రాయ్‌బరేలిలో హరియోమ్ మూక హత్య మానవాళిని సిగ్గుపడేలా చేసింది. తన ప్రాణాలను కాపాడుకోవడానికి రాహుల్ గాంధీ పేరును వాడుకుంటున్నప్పుడు, చెడ్డ వ్యక్తులు "మేము బాబా నుండి వచ్చాము" అని అంటున్నారు. ఇది యోగి రాజ్ యొక్క నిజమైన ముఖం. న్యాయం చేయడానికి బదులుగా, యుపి పోలీసులు నిందితులపై 'ఉద్దేశపూర్వకంగా హత్య' నేరాన్ని మోపారు, తద్వారా హంతకులు కొన్ని రోజుల్లో బయటకు వస్తారు. ఈ జాతి ఆధారిత హింస మరియు ద్వేషపూరిత నమూనాలను మేము అమలు చేయనివ్వము. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, హరియోమ్ కుటుంబానికి క్షమాపణలు చెప్పాలని అన్నారు ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు షఫిక్ అహ్మద్ పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పడిగెల ప్రదీప్ పిట్టల బాలరాజ్, మహమ్మద్ జలీల్ అలీమ్, శరత్, రాఘవ, వరుణ్, కాసిఫ్ దిలీప్, శివ కిరణ్, రిజ్వాన్, అభినవ్ కార్తీక్, వరుణ్ తేజ్, మణికంఠ, సుభాష్, చింటూ,సాయి తేజ తదితరులు పాల్గొన్నారు.